# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 23 మే, 2024 | పేజీలు : 06


## మలహ్రాావు మాటులో దెబ్బతిన్న పంట పొలాలు



**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని చేల్పూర్ మలహల్ రావు మాట సమీపంలో చేతికి వచ్చే దశలో పంట పొలాలు పూర్తిగా దెబ్బ తిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మునిగి దెబ్బతిన్న వరి పంటను రైతులు చూసి భోరుమన్నారు. వరి పంటలు కోతకు వచ్చి కోసే సమయంలో భారీ వర్షాలతో పొలాలు మొత్తం మునిగిపోయాయి అన్నారు. దీంతో మొలకలు వచ్చాయని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కున్నారపు రాజయ్య, బండారి రవీందర్, మొగులోజు హగ్రివాచారి, జూకంటి భద్రయ్య, చెప్పాల నిర్మల, తోట రాకేష్, పెరక గోవిందు, నీలారపు రాజమౌళి, నీలారపు చంద్రశేఖర్, బావడల్లపెల్లి కోటి, కోరె కిరణ్, అడుప సమ్మయ్య, దాసరీ రవీందర్, కడిగిన రమేష్ లు డిమాండ్ చేశారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

### కలెక్టర్ క్రాంతి వల్లూరు

**ప్రజాపక్షం/ కొండాపూర్ :** ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుదవారం కొండాపూర్ పరిదిలోని పలు కొనుగోలు కేంద్రాలనుజిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ సమీపిస్తున్నందున దాన్యం కొనుగోలు వేగవంతం చేయాలనికొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మిల్లుల వద్ద ధాన్యం తర్వగా ఆన్ లోడ్ చేయించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సంగారెడ్డి డివిజన్ లోని మల్కాపూర్ గొల్లపల్లి, తేర్పోల్ ,కొండాపూర్, గ్రామాలో పిఏసిఎస్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు, రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ మార్పులకనుగుణంగా ఉదయమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తెలిపారు. రోజు ఐదు లారీలు కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా అదికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆకాల వర్షాలు పడుతున్నందున వేగంగా కొనుగోలు చేసిన దాన్యాన్ని మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. చివరి గింజవరకు దాన్యం కొనుగోలు చేయాలని సెంటర్ ఇన్చార్జీలకు ఆదేశించారు గన్నీ బ్యాగ్ల సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని తెలిపారు. మిల్లులకు ఇచ్చిన కెపాసీటీని పూర్తి చేయాలని రైతుల నుండి కొనుగోళ్లకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని మిల్లులలో ఖాళీ స్థలాలను పెంచుకొని దాన్యం లారీలను త్వరగా ఆన్ లోడ్ చేయించాలని ఆ వెంటనే ఆన్ లైన్ నమోదు చేయాలని ఆదేశించారు. దాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైస్ మిల్లర్లు కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు రైతుల వివరాలు నమోదు చేసి వివరాలను నమోదు చేయాలని వెంటనే పౌరసరఫరాల శాఖ అధికారులు ఆయా రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయాలని ఆదేశించారు. పిఏసిఎస్ గోదాములలో ఉన్నా ధాన్యాన్ని త్వరగా ఖాళీ చేస రైసు మిల్లులకు తరలించాలని ఆదేశించారు. సధాశివపేట్, కొండాపూర్‌లలో ఉన్నా జోన్నల కొనుగోలు కేంద్రాల లో జొన్నలు కొనుగోలు వేగవంతం చేయాలని, వాటిని గోదాములకు తరలించాలని



తరువాయి 6లో

# ఎంజిఎంను సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి:** మహాత్మాగాంధీ మెమోరియల్ ఆసుపత్రిలో మంగళవారం సాయంత్రం విద్యుత్ అంతరాయం కావడంపై జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ఎంజిఎం ఆసుపత్రిలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆసుపత్రిలో ఉన్న అన్ని జనరేటర్లు, అనుసంధానంలో ఉన్న వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ అంతరాయంకు గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ అంతరాయం జరిగిన సమయంలో ఎలాంటి వైద్య చికిత్సలను ఆపడం జరగలేదని కలెక్టర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం 6:15గంటలకు ఆసుపత్రిలో విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఏర్పడగా ఎన్‌పిడిసిఎల్ అధికారులను సంప్రదించగా తక్షణమే వారు స్పందించి విద్యుత్ జంపర్లు సరిచేసి ఆదే రోజు రాత్రి 8:45 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం జరిగిందన్నారు. డయాలసిస్ విభాగానికి తప్ప ఎమర్జెన్సీ వార్డులతో సహా అన్ని వార్డులకు విద్యుత్ సరఫరా చేయడం జరిగిందని, డయాలసిస్ వార్డులో రిపేరులో ఉన్న జనరేటర్‌ను మరమ్మత్తులు చేయడం జరిగిందని సూపరింటెండెంట్, కలెక్టరుకు వివరించారు. డయాలసిస్ విభాగానికి సంబంధించిన జనరేటర్ పనిచేయకపోవడంపై సంజాయిషీ సమర్పించాలని ఎంజిఎం సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆడిట్ రిపోర్డు ప్రకారం భవిష్యత్తు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా మెయిటెనెన్స్ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం ఇంఛార్జీ సూపరింటెండెంట్ రామ్ కుమార్ రెడ్డి, ఎన్‌పిడిసిఎల్ ఎఇ మధుసూదన్ రావు, డిఇ మల్లికార్జున్, ఎడిఇ శ్రీనివాస్‌రెడ్డి, ఎంజిఎం ఆర్‌ఎంఓలు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### స్వాముల పాదయాత్రను

# ప్రారంభించిన సీతక్క



### మంత్రి దనసరి అనసూయ సీతక్క

**ప్రజాపక్షం/ఏటూరు నాగారం:** ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు గ్రామంలో నేడు గురువారం జరగబోయే శ్రీ లక్ష్మినరసింహ స్వామి జాతర కార్యక్రమానికి ఏటూరునాగారం రామాలయ కుటీరం అంజన్న స్వాములు చేపడుతున్న పాదయాత్రను మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. 25 కిలోమీటర్లు వరకు పాదయాత్రను చేపట్టానున్న అంజన్న స్వాములు, హనుమాన్ టెంపుల్ క్రాస్ రోడ్ వద్ద ప్రారంభం చేసి హనుమాన్ మాలధారణ అంజన్న స్వాములు పాదయాత్రకి స్వాగతం పలికి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి, ఆంజనేయులు వారి అశీసులు భక్తులకు, ప్రజలకు కలగాలని మంత్రివర్యులు ధనసరి సీతక్క కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, భక్తులు, ప్రజలు, జిల్లా, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సహకార సంఘము నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారులపై ప్రజలకు నమ్మకం పోతుంది

**ప్రజాపక్షం/కమలాపూర్:** ఇటీవల కమలాపూర్ తహశీల్దార్ కార్యాలయంలో ఒక రైతన్న దగ్గర లంచం తీసుకుంటూ ఏసిబి అధికారులకు పట్టుబడ్డ తహశీల్దార్ మాధవి, అలాగే ధరణి ఆపరేటర్ రాకేష్ లు అన్నదాత దగ్గర రూ. 5వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన విషయం మనందరికి తెలిసిందే. ఇలాంటి లంచగొండి అధికారులు, అవినీతి అక్రమాలకు పాల్పడితే కొద్ది మంది అధికారుల ప్రవర్తన తీరు పట్ల ప్రభుత్వ అధికారులపై ప్రజలకు నమ్మకం కోల్పోతుందని ప్రజాసామ్య విద్యార్థి సంఘం నాయకుడు ఉప్పుల శివ అన్నారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాత దగ్గర ఇలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడే అధికారులు లంచం తీసుకోవడం చాలా సిగ్గుచేటని వారన్నారు. ఎన్నో కష్టనష్టాలను భరించి తాను పస్తులుండి దేశానికి ఆహారాన్ని అందించే అన్నదాత దగ్గర ఇలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడే అధికారులు లంచం తీసుకోవడం చాలా సిగ్గుచేటని వారన్నారు.



కొద్ది మంది అధికారులు చేసే అవినీతి దుశ్చర్యాల వలన ప్రభుత్వ పాలనపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతున్నదన్నారు. ఇలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోని రానున్న రోజుల్లో ఇలాంటి ఘటనలు నివృాతం కాకుండా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి అధికారుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే వెంటనే ఏసిబి అధికారులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలందరికీ అండగా ఉంటా



**ప్రజాపక్షం/పాలకుర్తి:** బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలందరికీ అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని దర్దేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గిరగాని యాకయ్య మృతిచెందడంతో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ద్వారా రూ.2లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ రావు, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జెడ్పీటీసీ పి శ్రీనివాసరావు, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ మదార్, దర్దేపల్లి మాజీ సర్పంచ్ ఇమ్మడి ప్రకాశ్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పి నవీన్, కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, శ్రీనివాస్, కమ్మగాని పరమేశ్వర్, గిరగాని సమ్మయ్య, కృష్ణమూర్తి, సురేష్, అంజయ్య, పట్టభద్రులు, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం.....



**ప్రజాపక్షం/పాపన్నపేట:** మండల కేంద్రమైన పాపన్నపేట లోని శ్రీ వేంకటేశ్వర హాస్పిటల్ వారు ఉచిత సంతాన సాఫల్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు నవీన్, వెంకటేష్ గౌడ్, రవి గుప్తా, విఠలేశ్వర్ గుప్తాలు వెల్లడించారు. పాపన్నపేట మండలాల నుండి సంతాన లేమితో బాధపడుతున్న వారు వెంకటేశ్వర ఆస్పత్రిలో నిర్వహించిన క్యాంపులో 63 మంది పేషెంట్లు డాక్టర్లను సంప్రదించారు. కిఐవిఎఫ్ అక్సిస్స్ ఫర్టిలిటీ కేంద్రం హైదారాబాద్ వారి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించగా డాక్టర్ రామ్ లక్ష్మినారాయణ, ఇన్ ఫర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ అముదల్ల శృతి 63 మంది మహిళలను ఉచిత పరీక్షలు నిర్వహించి సమస్యలు ఉన్న మహిళలకు సహాలు సూచనలు ఇవ్వడంతో పాటు ఉచిత మందులు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరం సుదూరంగా వెళ్ళలేని వారికి ఎంతగానోఉపయోగపడుతుందని అన్నారుఅన్నారు.

## రేణుక ఎల్లమ్మ దీవెనలు ఎల్లవేళలా ఉండాలి



**ప్రజాపక్షం/ కమలాపూర్:** రేణుక ఎల్లమ్మ దీవెనలు ఎల్లవేళలా ప్రజలందరి పై ఉండాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. కమలాపూర్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన రేణుక ఎల్లమ్మ, భీరన్న జాతరకు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జాతరలలో మొక్కులు అప్పజెప్పారు. అనంతరం భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని దేవుళ్ళని కోరుకున్నానని అన్నారు. తెలంగాణ మొత్తం పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉండాలని ఆకాక్షించారు. రానున్న వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల ముఖాల్లో ఆనందం చూడాలని ప్రార్థిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పండించే రైతులకే బోనస్ ఇస్తామనడం సరైంది కాదని, ఏ రకమైన వడ్లను పండించిన తప్పకుండా బోనస్ ఇవ్వాలని అన్నారు. రైతులకు వెంటనే రెండు లక్షల రుణ మాఫీ కూడా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చరిత్రకే చెదలు పట్టిస్తున్న వైనం



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** ఓరుగల్లు నగరాన్ని రాజధానిగా చేసుకొని వారి సామ్రాజ్యాన్ని నలుదిక్కుల విస్తరింపజేసి ప్రజల మన్ననలను పొంది ఎంతో కీర్తి ప్రతిష్టలను దర్కించుకున్న ఘనత కాకతీయ వంశస్తులది. కాకతీయ వంశస్తుల్లో ఒకరైనా రాణి రుద్రమాదేవి ఎంతో కీర్తి ప్రతిష్టలు సంపాదించుకొని ప్రజల మన్ననలను పొందిన మహారాణి అని అన్నది అందరికి విధితమే అలాంటి రాణి రుద్రమాదేవి ఇప్పుడు చరిత్రకే చెదలు పట్టిస్తున్న వ్యవస్థలో పరాభవ స్థితిలో ఉండడం అందరిని విస్మయానికి గురి చేస్తుంది. గోవిందరావుపేట మండలంలోని చల్వాయి గ్రామ శివారున లక్నవరం మూల మలపున రుద్రమాదేవి విగ్రహాన్ని ఏర్పాటుచేసిన అది ప్రారంభించక ముందే గత సంవత్సరం గాలి వానలకు పడిపోయిన ఆ విగ్రహాన్ని మరలా మరమ్మత్తు చేసి ప్రారంభించకుండానే ఆ విగ్రహాన్ని పక్కనే ఉన్న చెత్తలో పడేయడం అటుగా లక్నవరానికి వెళ్తున్న పర్యాటకులు చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. ఎన్నో వందల కిలోమీటర్ల నుండి ర్యాటకులు ఆ దారి వెంట లక్నవరానికి వస్తూ పోతూ వారికి కనబడుతున్న రుద్రమాదేవి పరాభవం మండలంలోని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ఎవరికి కనబడడం లేదా అని అక్కడికి వచ్చి చూస్తున్న పర్యాటకుల మదిలో మెదులుతున్న ప్రశ్న? ఇకనైనా మేల్కొని పరాభావంలో ఉన్న రాణి రుద్రమాదేవి విగ్రహాన్ని మరల పునర్ ప్రతిష్టింపజేయాలని అలా చేయడం వలన చరిత్రలను భావితరాలకు తెలిసేలా ఉంటుందని పలువురి పర్యాటకుల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పట్టభద్రుల ఓటు వృథా కానివ్వొద్దు



**ప్రజాపక్షం/సంగెం:** వరంగల్, నల్గొండ, ఖమ్మం శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీకి విజయం దక్కలేదని.. కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని వరంగల్ కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని గౌడ సంఘం కమ్యూనిటీ హాలులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్యే ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమని ప్రతీ పేదవారికి ప్రభుత్వ ఫలాలు అందించిన లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ వొడితల ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే బిక్షపతి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కళావతి, మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, జనగాం రమేశ్, మెట్టుపల్లి రమేశ్, ఆగపాటి రాజు, మాజీ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నరహరి, 17వ డివిజన్ అధ్యక్షుడు సాల్మన్‌తోపాటు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చాంద్ పాషా కుటుంబ సభ్యులను పరామర్శ



**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండల వాస్తవ్యులు బిఆర్ఎస్ పార్టీ మాజీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు కీ.శే చాంద్ పాషా కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేసిన భూపాలపల్లి మాజీ శాసన సభ సభ్యులు గండ్ర వెంకట రమణా రెడ్డి, ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మి నరసింహా రావు, గణపురం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మోతె కరుణాకర్ రెడ్డి, తిరుపతి, శనిగరపు రాజేందర్, సీనియర్ నాయకులు జనయ్య, యూత్ నాయకులు గాజర్ల చింటూగౌడ్ గౌతమ్ పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న గెలుపుకోసం కృషి చేయాలి



**ప్రజాపక్షం/టేకుమట్ల:** నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపుకోసం ప్రతీ కార్యకర్త తమ వంతు కృషిచేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొటగిరి సతీష్ గౌడ్ పిలుపునిచ్చారు. తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు అందరూ అండగా ఉండాలని కోరారు. బీజేపి, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని, తెలలంగాణ ప్రజల కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టె తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు.

## విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** విద్యుత్ షాక్ తో రెండు పాడి గేదేలు మృతి చెందిన సంఘటన నాంచారి మదూరు శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బంగారి సోమయ్యకు ఉన్న 2 పాడి గేదెలు రోజువారీగా ఉదయం ఇంటి దగ్గర నుండి మేత కోసం కొట్టుకు వెళుతున్న క్రమంలో కరెంట్ తీగలు తెగి ఉండడంతో మేత కోసం వెళ్తున్న పాడి గేదెలకు విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్ షాక్ కు గేదేలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితుడు బంగారి సోమయ్య మాట్లాడుతూ విద్యుత్ అధికారులు విద్యుత్ వైర్లను సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం వల్లే విద్యుత్ వైర్లు తెగి ఉండడంతో మేత కోసం వెళ్తున్న మా వాడికి గేదెలు మృతి చెందాయని వాపోయారు. ఈ గేదె ల విలువ సుమారు రూ.2 లక్షల పైగా ఉంటుందని,ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



**ప్రజాపక్షం/కొడకండ్ల:** ఎమ్మెల్సీ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అభ్యర్థి తీన్మార్ మల్లన్నను పట్టభద్రులు భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురేష్ నాయక్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బుధవారం మండలంలోని రంగాపురం గ్రామంలో నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సిరాజేందర్‌రెడ్డిల ఆదేశాల మేరకు ప్రతి పట్టభద్రున్ని స్వయంగా కలిసి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలు పరిష్కారం కావాలంటే మల్లన్న గెలవడం అవసరమన్నారు. కావున ఆయనను భారీ మెజార్టీతో గెలిపించి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఇంచార్జి ఝాన్సిరాజేందర్ రెడ్డిలకు బహుమతిగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు ఐలయ్య, కొడకండ్ల మండల యూత్ అధ్యక్షులు దూదిమెట్ల యాకేష్ యాదవ్, పట్టణ అధ్యక్షులు మసురం రవీందర్, అబ్దుల్లా, రంగాపురం గ్రామ పార్టీ అధ్యక్షులు సోమారపు ఐలయ్య, డైరక్టర్ రాజు, సంజీవ, సతీష్, అంతాలు, సమ్మయ్య, యాదగిరి, అశోక్, రాజు, శంకర్, యాకన్న, సైదులు, శంకర్, సత్యం, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహం బాలికల అభివృద్ధి నిరోధకం




ప్రజాపక్షం/ఏటూరు నాగారం: ఏటూరునాగారం మండలంలోని గుర్రాల బావి గుత్తికోయ ఆవాస గ్రామంలో బాలల పరిరక్షణ విభాగం ములుగు ఆధ్వర్యంలో గ్రామస్తులకు బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు ఇతర బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పరిరక్షణ అధికారి ఎన్ హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లెనినా, ఏటూరునాగారం సిడిపిఓ బాల్య వివాహ నిరోధక అధికారి శ్రీమతి వి హేమలత ముఖ్య అతిథులుగా హాజరు కావడం జరిగింది. ముందుగా ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించినటువంటి పరిరక్షణ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ములుగు ఆధ్వర్యంలో సున్నా నుండి 18 సంవత్సరాల లోపు పిల్లలకు అందించే సేవలను గురించి వివరించారు. అనంతరం బాల్య వివాహాల నిరోధక అధికారి ఏటూరునాగారం సిడిపిఓ శ్రీమతి వి హేమలత మాట్లాడుతూ, 18 సంవత్సరాలు వయసు నిండకుండా ఆడపిల్లలకు, 21 సంవత్సరాల వయసు ఉండకుండా అబ్బాయిలకు వివాహం చేయరాదని అలా చేసినట్లయితే అది చట్టరీత్యా నేరమని తెలిపారు. అనంతరం ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి ఒక్కరు ఆరు సంవత్సరాల లోపు వయసున్న పిల్లలందరినీ తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రానికి పంపాలని సూచించారు. అంగన్వాడి ద్వారా అందించే సేవలను తప్పనిసరిగా వాడుకోవాలని అలాగే అంగన్వాడి ద్వారా అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులైన చిన్నారులు గర్భిణీ స్త్రీలు, బాలింతలు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలోని చిన్నారులు సరైన పరిశుభ్రత ను పాటించడం లేదని తాము గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమం లో సంబంధిత సెక్టార్ సూపర్వైజర్ విద్య, సోషల్ వర్కర్ జ్యోతి, గ్రామ పెద్ద దేవయ్య, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ దీక్షపరులకు అభయమిచ్చిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/కమలాపూర్: కమలాపూర్ మండల కేంద్రంలోని తీగల బావి వద్ద గల భక్తాంజనేయ స్వామి దేవాలయంను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పునరుద్ధరణకై హనుమాన్ భక్తులందరూ పాడి కౌశిక్ రెడ్డి సమస్యలను విన్నవించారు. కోనేటి పునరుద్ధరణ, గుడి చుట్టూ ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్లు మొదలైన సమస్యలపై పాడి కౌశిక్ రెడ్డి కి విన్నవించారు. హనుమాన్ భక్తులు విన్నవించినటువంటి సమస్యలన్నిటికి సానుకూలంగా స్పందించిన కౌశిక్ రెడ్డి, ఎలక్షన్ కోడ్ అయిపోయిన తర్వాత గుడి పునరుద్ధరణకు పూర్తిగా సహకరించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తీగల బావి భక్తాంజనేయ ఆలయ అభివృద్ధి కమిటీ, హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్సై భార్య నిరసన




ప్రజాపక్షం/కొమురవెల్లి: కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్సై నాగరాజు మొదటి భార్య తమ పిల్లలను అప్పగించాలని ఆందోళనకు దిగింది. వివరాల్లోకి వెళితే సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలో సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా విధులు నిర్వర్తిస్తున్న నాగరాజుకు కరీంనగర్ జిల్లాకు చెందిన మానసతో 12 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరి సంతానం గత కొంతకాలం ఇద్దరి మధ్య గొడవలు కావడంతో ఇద్దరి కుమారులను తీసుకొని కలిసి కొమురవెల్లి లో పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ అక్కడే ఉంటున్నాడు.ఎస్సై నాగరాజు ఎవరికి తెలియకుండా మొదటి భార్యకి విడాకులు ఇవ్వకుండానే రెండో భార్యతో కలిసి ఉంటున్నాడని, రెండో భార్య వల్ల తన కుమారులకు ప్రాణహాని ఉందని గత రెండు నెలల నుంచి పిల్లలతో ఫోను ద్వారా కలవనివ్వడం చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది.ఎలాగైనా తన పిల్లలను తనకు అప్పజెప్పి పై అధికారులు ఎస్సై నాగరాజు పై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరింది.

## సబ్సిడీ పై జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి

ప్రజాపక్షం/మహాముత్తారం : మండల రైతులకు 60 తో సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేయడానికి వ్యవసాయ సహకార సంఘం వద్ద బస్తాలు అందుబాటులో ఉన్నాయని, మండల వ్యవసాయ అధికారి సతీష్, బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## పూజారి సత్యనారాయణను గెలిపించాలి



ప్రజాపక్షం/వెంకటాపురం(నూగూరు): వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం ఎంఎల్సి అభ్యర్థిగా పూజారి సత్యనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్హెచ్ఆర్సి) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య పిలుపునిచ్చారు. గోగులమూడి హరికృష్ణ అధ్యక్షతన వెంకటాపురం మండల కేంద్రంలో బుధవారం జరిగిన ఎన్హెచ్ఆర్సి వెంకటాపురం మండల కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంఎల్సి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్న పూజారి సత్యనారాయణ ములుగు జిల్లాలోని పలు మండలాల్లో విద్యాశాఖ అధికారిగా పని చేశారని, విద్యాశాఖపై మంచి అవగాహన కలిగిన వ్యక్తి అని అన్నారు. శాసన మండలికి అనుభవజ్ఞులైన విద్యావంతులను ఎంఎల్సిగా పంపాల్సిన బాధ్యత పట్టభద్రులైన ప్రతి ఒక్కరిది అని ఆయన గుర్తు చేశారు. రాజకీయ పార్టీలతో ప్రమేయం లేకుండా స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్న పూజారి సత్యనారాయణకు ఎన్హెచ్ఆర్సి సపోర్ట్ ఉంటున్నారు. సీరియల్ నెంబర్ 38కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆయనను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఈసి సభ్యులు పిల్లల లీలారాణి, జిల్లా మహిళా అధికార ప్రతినిధి గుర్రం సుభాషిని, జిల్లా అధ్యక్షులు పెట్టం రాజు, జిల్లా ఎన్నికల కన్వీనర్ రవి, మండల కమిటీ నాయకులు రాయుడు జయరాజు, మొర్రం రాజేష్, రామకృష్ణ, పంచాయతీ కన్వీనర్లు పర్శిక రాజు, తెల్లం ఆనంద్, కారం మధు, పరిశిక సాయి, పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం..

ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పార్టీ సభ్యత్వమున్న ప్రతి కార్యకర్తలకు 2 లక్షల ప్రమాద భీమా పార్టీ అందజేస్తుందని మాజీ మంత్రి ఎంఎల్ఏ హరీష్ రావు అన్నారు.బుధవారం నంగునూర్ మండలానికి చెందిన సుచనకోట యాదగిరి ఇటీవల ప్రమాదావశాత్తు నీట మునిగి మరణించగా 2 లక్షల ప్రమాద భీమా చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎంఎల్ఏ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు 48 మందికి 2 లక్షల చొప్పున 96 లక్షల రూపాయాలు మంజురయ్యాయని తెలిపారు. అంకుముందు సిద్దిపేట అర్బన్ మండలంలోని ఎన్సాన్పల్లి గ్రామంలో జరుగుతున్న పోచమ్మ ఉత్సవాల్లో,సిద్దిపేట రూరల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పెట్రోల్ బంకులో వినియోగదారుల ఆందోళన



ప్రజాపక్షం/శివ్వంపేట: వాహానాలలో పెట్రోల్ తక్కువగా వస్తుందని మండల కేంద్రమైన శివ్వంపేటలోని అంజన పెట్రోల్ బంకులో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. బాధితుల వివరాల ప్రకారం కొందరు యువకులు పెట్రోల్ పోయించుకునేందుకు అంజన పెట్రోల్బంకుకు వచ్చి బైకులో పెట్రోల్ పోయించుకున్నారు. పెట్రోల్ తక్కువగా వచ్చిందని, రీడింగ్లో ఏదో మోసం ఉందని గ్రహించిన వినియోగదారులు వెంటనే జారులో ఒక లీటర్ పెట్రోల్ పోయించి తనిఖీ చేపట్టగా అందులో 60మిల్లీలీటర్లు తక్కువగా రావడంతో వినియోగదారులు బంకు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టపడి బైకులో పెట్రోల్ పోయించుకుంటనే మమ్మల్నీ అంజన పెట్రోల్బంకు యాజమాన్యం దోపిడి చేస్తుందని మండిపడ్డారు. పెట్రోల్ బంకులో పెట్రోల్, డీజిల్ తక్కువగా వస్తుందని ఆందోళన చేపట్టిన విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు చేరుకొని బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేయించారు. ఇంతటి మోసాలకు పాల్పడుతూ వినియోగదారులకు తక్కువగా పెట్రోల్, డిజిల్ పోస్తున్న అంజన పెట్రోల్ బంకు యాజమాన్యంపై జిల్లా ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు చేపట్టి న్యాయం చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సేంద్రీయ ఎరువుల పంపిణీని ప్రారంభం



ప్రజాపక్షం/నిజాంపేట్: నిజాంపేట్ మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం నందు పచ్చి రొట్ట ఎరువుల పంపిణీని ప్రారంభించారు. రైతులకు పచ్చి రొట్ట ఎరువులు 60 సబ్సిడీ పై నిజాంపేట్ మండలంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రం, డిసిఎంఎస్ లో అందుబాటులో ఉన్నాయని రైతులు పచ్చి రొట్ట వేయడం వల్ల ఎకరానికి 10 టన్నుల పచ్చి రొట్ట ఎరువు లభిస్తుంది. 60 కిలోల నత్రజని, 15 కేజీల భాస్వరం, 50 కేజీల పొటాష్ భూమిలో కలుస్తుందన్నారు. పచ్చి రొట్ట ఎరువులు వేసుకోవడం వల్ల నేల భౌతిక స్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి నేలలోకి నీరు ఇంకే గుణం పెరుగుతుందని, నెలలో సేంద్రీయ పదార్థం పెరగండ వల్ల సూక్ష్మ జీవులు వృద్ధి చెంది, జీవ రసాయనిక చర్యల వల్ల నేల సారం పెరగడమే కాక, నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకొని ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుకుంటుందని చెప్పారు. కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చని, చౌడు భూముల పునరుద్ధరణకు ఉపయోగపడుతుందన్నారు. ఎకరానికి 12 నుండి 15 కిలోల విత్తనం అవసరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్ నారాయణ, ఏఈవో శ్రీలత, కావేరి డిబిఎఫ్అధ్యక్షులు దుబాసి సంజీవ్ రైతులు పాల్గొన్నారు.

## రైతులెవరు అధైర్యపడొద్దు



ప్రజాపక్షం/శివ్వంపేట : అకాల వర్షాలకు తడిసిన వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఎవరు అధైర్యపడవద్దని మండల తహశీల్దార్ శ్రీనివాస్చారీ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి గ్రామాలలో ఏర్పాటు కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతినిత్యం ధాన్యం తూకం వేసి రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని అన్నారు. వడ్లు తడిసియాని రైతులు దిగులు పడొద్దని, తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. మండలంలోని పాంబండ, బిజిలీపూర్ గ్రామాలలో వందశాతం వడ్లు కొనుగోలు చేశామని, మిగతా గ్రామాలలో కూడా త్వరితగతిన కొనుగోలు పూర్తి చేస్తామని ఆయన అన్నారు. వర్షాభావ సూచనలు ఉన్నప్పుడు రైతులు కొంచెం జాగ్రత్త పాటించాలని సూచించారు. వడ్లు కొనుగోలు గురించి ఇలాంటి అపోహాలు గానీ, దిగులు గానీ చెందొద్దని రైతులకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ఆయన అన్నారు.

## రెండు లక్షల మెజారిటీతో వెంకటరామిరెడ్డిదే విజయం



ప్రజాపక్షం/కొడిపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్ రామ్ రెడ్డి 2 లక్షల మెజారిటీతో గెలుపొందడం ఖాయమని బిఆర్ఎస్ మండల నాయకులు యువ నాయకులు పోల నవీన్ కుమార్ తెలిపారు. బుధవారం రోజు మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండు లక్షల మెజారిటీతో మెదక్ బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట రామిరెడ్డి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. 100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద ప్రజలకు విద్యార్థులకు చదువులకు ఖర్చు చేయడం జరుగుతుందని పేదింటి ఆడపిల్లలకు పెండ్లిలకు ప్రతి మండల కేంద్రాలలో ఒక రూపాయికి ఫంక్షన్ హాల్ లు ఏర్పాటు చేస్తారని గెలిచిన వెంటనే ఈ కార్యక్రమాలు అమలు చేస్తారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన సంక్షేమ అభివృద్ధి పథకాలు రైతు బంధు రైతు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంటు, మిషన్ భగీరథ, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచి నీరు, వృదులకు, వితంతువులకు వికలాంగులకు పింఛన్లు కేసిఆర్ కిట్టు, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, దళిత బంధు, బీసీ బంధు, ఇలాంటి మరెన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి మన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని ప్రజలు బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి వెంకటరామిరెడ్డి ఆదరించి మెజారిటీతో గెలిపించుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ మోసపూరిత మాటలు వినొద్దు



**ప్రజాపక్షం/పర్వతగిరి:** కాంగ్రెస్ మోసపూరిత మాటలు వినొద్దని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం పర్వతగిరి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని మాట్లాడుతూ.. కాంగ్రెస్ మోసపూరిత మాటలు వినే ఇప్పటికే ప్రజలు మోసపోయారు. కాని రానున్న గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ ఎన్నికలు ఒక బ్లాక్ మెయిలర్‌కు... ఒక విద్యావంతునికి మధ్య జరుగుతున్న పోటీ అన్నారు. సోషల్ మీడియా వేదికగా చేసుకొని తాను ఒక ప్రశినంచే గొంతుక అని చెప్పి ప్రజల్లోకి వెళ్లిన వ్యక్తి అదే సోషల్ మీడియాని అడ్డం పెట్టుకొని జోరుగా బ్లాక్‌మెయిల్ దందాలు చేసి డబ్బులు వసూలు చేశాడు. కాని నేడు అదే సోషల్ మీడియా వేదిక తాను చేసిన అక్రమాలు, బ్లాక్‌మెయిల్ దందాలు అన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న తీరు మనం చూస్తూనే ఉన్నామన్నారు. కావున ఇలాంటి వ్యక్తులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ప్రతీ ఒక్క గ్రాడ్యుయేట్‌పై ఉందన్నారు. కావున అద్భుతమైన వాగ్దాటి, పోరాట పటిమ, ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం కల్గిన రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో చల్మెడ లక్ష్మి నర్సింహారావు, మండల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న మాజీ మంత్రి కేటీఆర్



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** టిఆర్ఎస్ అధినేత, మాజీ మంత్రి కెటిఆర్ మానవత్వం చాటుకున్నారు. వరంగల్ లేబర్ కాలనీ వద్ద అంజయ్య (55) అనే వ్యక్తి ఆక్సిడెంట్‌కు గురై రోడ్డుపై కిందపడి చావు బ్రతుకుల్లో కొట్టు మిట్టాడుతున్నాడు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచార నిమిత్తం అటుగా వెళ్తున్న కెటిఆర్ తన కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ కారులోచికిత్స కోసం వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించాడు. సంబంధిత వైద్యులకు, అతని బంధువులకు సైతం సమాచారం అందించేలా అధికారులను పురమాయించి మానవత్వం చాటుకున్నారు.

## బాధిత కుటుంబానికి చేయూత



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టి నాయకుడు దామెర స్వామి మృతిచెందడంతో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టి ఆధ్వర్యంలో బుధవారం రూ.15వేల ఆర్థికసహాయం అందించారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బిర్రు సోమేశ్వర్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. స్వామి గ్రామంలో కాంగ్రెస్ పార్టి బలోపేతానికి అహర్నిశలు కృషి చేశాడన్నారు. స్వామి కుటుంబానికి పార్టీ చేదోడువాదోడుగా ఉంటుందన్నారు. ఆయన వెంట నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు గోనె మహేందర్ రెడ్డి, అశోక్, కుటుంబ సభ్యులున్నారు.

## నేడు వేణుగోపాలస్వామి కళ్యాణం

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలోని గోవర్ధనగిరి వేణుగోపాలస్వామి గుట్టపై గురువారం శ్రీవేణుగోపాలస్వామి కళ్యాణమహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఆలయ కమిటి నిర్వాహకులు మాట్లాడుతూ మధ్యాహ్నం 12:30 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణాలతో అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహిస్తామన్నారు. ఈ కళ్యాణ మహోత్సవానికి పెద్దసంఖ్యలో గ్రామస్థులు హాజరుకావాలని వారు కోరారు.

## కేంద్ర అధికారుల బృందం శిక్షణ కార్యక్రమం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో కొనసాగుతున్న కేంద్ర సర్వీస్ అసిస్టెంట్ సెక్షన్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మూడో రోజు శిక్షణ అధికారుల బృందం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రూరల్ వాటర్ సప్లై స్కీం లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వారి పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర శిక్షణ అధికారుల బృందం, గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, కారోబార్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం: వాల్ పోస్టర్ ఆవిష్కరిణ



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ అటవీ క్షేత్ర కార్యాలయంలో బుధవారం స్థానిక స్వచ్చంద సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫారెస్టు రకేంజ్ ఆఫీసర్ రవికిరణ్ చేతుల మీదుగా జీవ వైవిధ్య పరిరక్షణ గోడపత్రికలను ఆవిష్కరించారు. వాతావరణ కాలుష్యాల వలన అనేక జీవ రాశులు తమ మనుగడను కొల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీవ వైవిధ్య రక్షణే జీవ రక్షణ అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు పాటుపడాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఆర్ సంస్థ నిర్వాహకులు, పర్యావరణ ప్రేమికుడు ఎర్రబోయిన రాజశేఖర్, స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్, చాయా సంస్థ నిర్వహకులు కోట డేవిడ్, కన్స్యూమర్ ఫోరమ్ విజిలెన్స్ కమిటి సభ్యులు నాగెల్లి సారంగం గౌడ్, సోషల్ వాలంటీర్ మొగిలి చర్ల రాము సేవక్, ఫారెస్టు బీట్ ఆఫీసర్లు చంద్రమౌళి, నార్య, బెస్ క్యాంప్ నాగరాజు, ఫారెస్టు సిబ్బందిచారి తదితరులు పాల్గొన్నారు.

## కిర్గిస్థాన్ విద్యార్థులకు అండగా ఉంటాం



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** కిర్గిస్థాన్‌లో చోటు చేసుకుంటున్న ఘటనలపై భారతీయ విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారని, వారిని భారత దేశానికి తిరిగి తీసుకువచ్చేందుకు అన్ని విధాలుగా కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడుతున్నానని వారిని త్వరలోనే స్వదేశానికి తీసుకువాస్తమని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపినట్లు జివికే ఎడ్యుటెక్ డైరెక్టర్ తిలుపారు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఇటీవల జరిగిన అల్లర్ల గురించి అడిగి తెలుసుకుని కిర్గిస్థాన్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని, సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని జివికే ఎడ్యుటెక్ డైరెక్టర్ తిలుపారుకు తెలిపినట్లు చెప్పారు. ఏదైనా సలహాల కొరకు భారత రాయభార కార్యాలయం హెల్ప్ లైన్ నెంబర్ 0555710041ను సంప్రదించాలని జివికే ఎడ్యుటెక్ డైరెక్టర్ తిలుపారు సూచించారు.

## పద్మశాలీల చేతిమగ్గంతో స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పణ



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండలంలోని బండ్లగూడెం గ్రామంలోని బండగుట్ట శ్రీలక్ష్మి నరసింహస్వామి కళ్యాణ మహోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రజలు, బండ్లగూడెం గ్రామ ప్రజలు కలిసి గ్రామ పంచాయితి కార్యాలయం నుండి లక్ష్మి నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్లు ఏర్పాటుచేసుకొని దాని వెనుక స్వామి వారికి మండల కేంద్రానికి చెందిన పద్మశాలి కులస్థులు టాక్టర్లో స్వయంగా మొగ్గం ఏర్పాటు చేసి స్వామి వారికి మొగ్గం నేస్తూ స్వామి వారిని లింగాలఘణపురం, బండ్లగూడెం గ్రామ వీధులలో డప్పు చప్పుల్లతో ఊరేగిస్తూ దేవాలయానికి వెళ్లేసరికి పద్మశాలి ఏర్పాటుచేసిన మొగ్గం మీద నేస్తున్న పట్టువస్త్రాలు పూర్తి అవడంతో వాటిని స్వామి వారి కళ్యాణానికి పద్మశాలీలు అందజేశారు. అనంతరం పద్మశాలీలు మాట్లాడుతూ లక్ష్మి నర్సింహస్వామివారికి స్వయంగా మొగ్గం ఏర్పాటుచేసి పట్టువస్త్రాలు నేయడం ఇది మాకు ఎంతో గొప్ప అవకాశం అని స్వామి వారికి ఎంతో రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కేమిడి బిక్షపతి, వంగ ఉప్పలయ్య, బిట్ల ఆంజనేయులు, బిట్ల నాగభూషణం, బింగి స్వామి, మహేశ్వరం మార్కండేయ, చిరంజీవి, సత్యనారాయణ, మహేశ్వరం సత్యనారాయణ, వెంకటేష్, గ్రామ ప్రజలు పడిదె కిషన్, మహిళలు, పాల్గొన్నారు.

## బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** బీజేపి ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని పట్టభద్రులు భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపి జనగామ నియోజకవర్గ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో ఎంపీడీవో, ఎంఆర్‌వో కార్యాలయాలలో పట్టభద్రులను వారు కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి నిరుద్యోగులను మోసం చేసిందని, ఇపుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టి కూడా నిరుద్యోగులను మోసం చేస్తుందని కావున పట్టభద్రులు ఆలోచించి బీజేపి పార్టీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సద్ది సోమిరెడ్డి, మండల నాయకులు దొంతుల చంద్రమౌళి, జూకటి గణేష్, బీజేవైఎం మండల అధ్యక్షులు బంగారు మహేష్, మండల సీనియర్ నాయకులు కూరెళ్ల వెంకట్ రెడ్డి, రావుల శ్రీకాంత్‌రెడ్డి, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 14వేల నుండి 15వేల వరకు మామిడి సాగు



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** ఫల పరిశోదన స్థానం సంగారెడ్డిలో రెండవ రోజు మామిడి రకాల పరిశోదన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి సందర్శించి వివిధ మామిడి రకాల గురించి తెలుసుకొని రైతులకు సంబాషించారు. రైతుల యొక్క సమస్యలు తెలుసుకున్నారు. మామిడి తోటలో జిల్లాలో మామిడి సాగు ఎంతో ముఖ్యమైనదని మామిడి విస్తీర్ణము 14 వేల నుండి 15 వేల ఎకరాల సాగు జరుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో 250 పైగా మామిడి రకాలను ప్రదర్శనానికి ఉంచారు. ఫల పరిశోదన స్థానం శాస్త్ర వేత్త అయినటువంటి డాక్టర్ సుచిత్ర హస్త బల్లి అని పిలువబడ గుర్రపు శాఖ 470 రకాల జన్యు సంపత్తికి ఏలా నిలయమైనదో వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ శ్రీదర్, ( ఏడిహెచ్ ) శైలజ(హెచ్ ఓ) సుమంత (హెచ్ ఓ ) స్పందన కీర్తీ ఫల పరిశోదన స్థానంలోని శాస్త్ర వేత్తు డాక్టర్ హరి షంత్ డాక్టర్ మాదవి, డాక్టర్ మౌనిక డాక్టర్ నితీష్, యుగందర్(ఏవో)పాల్గొని ఈ ఆకార్యక్రమన్ని విజయవంతం చేశారు.

## పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలి: ఎర్రబెల్లి




**ప్రజాపక్షం/కొడకండ్ల:** కాంగ్రెస్ మోసపూరిత హామీలు విని ఇప్పటికే ప్రజలు మోసపోయారని కానీ వచ్చే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో అందరు గ్రాడ్యుయేట్స్ కూడా ఆలోచించి ఓటేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టి ఇంచార్జి, పార్టీ సీనియర్ నాయకులు చల్మెడ లక్ష్మి నరసింహారావులు అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ అద్భుతమైన వాగ్దాటి పోరాట పటిమ, ప్రజా సమస్యలపై ప్రశ్నించేతత్వం కలిగిన బీఆర్ఎస్ పార్టి ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలన్నారు. గురువారం తొర్రూరు మున్సిపాలిటీ కేంద్రంలోని పీఎస్ఆర్ స్కూల్ ఆవరణలో పట్టభద్రుల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా రానున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు హాజరుకానున్నారని కావున మండలం నుండి పట్టభద్రులు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల పార్టి అధ్యక్షులు సిందె రామోజీ, మార్కెట్ చైర్మన్ పేరం రాము, మండల ఇంచార్జి, జెడ్పీ ఫ్లోర్ లీడర్, పాలకుర్తి జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్, ఎంపీపీ ధరావత్ జ్యోతి, మాజీ జీసీసీ చైర్మన గాంధీ నాయక్, ఎఫ్ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ మెట్టి సోమరాములు, మాజీ రైతుబంధు అధ్యక్షుడు దీకొండ వెంకటేశ్వర్‌రావు, గ్రామాల ఇంచార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయాధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ, కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పాఠశాల పునః ప్రారంభం కన్నా ముందే పూర్తి చేయాలన్నారు. కొండాపూర్ మండలం గొల్ల పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ బాలబాలికల ఉన్నత పాఠశాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన కనీసమౌళిక వసతుల కల్పన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు.పాఠశాల పునః ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన కనీస మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిని వనజా జిల్లా సహాయ వ్యవసాయాధికారిని మనోహరి తహసీల్దార్ అనిత డీఈఈ సుబాన్, ఏఈ కృష్ణ అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు వెంకటమ్మ, చంద్రకళ సంబంధిత అదికారులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ప్రజాపక్షం/కొమురవెల్లి: కొమురవెల్లి మండలంలో ఉన్న గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాడూరి రవీందర్‌లు డిమాండ్ చేశారు.బుధవారం రోజున కొమురవెల్లి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమావేశంలో మండల అధ్యక్షుడు బ్రహ్మణపల్లి పర్శరాములు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఇప్పటికైనా పెండింగ్లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరారు.గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు మౌలిక సదుపాయాలు చేతులకి గ్లౌజులు, నూనె సబ్బులు ఇవ్వాలన్నారు.అనంతరం ప్రతినిధి బృందంతో కలిసి కొమురవెల్లి ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి తాడూరి రాజలింగం, ఉపాధ్యక్షులు సాయిలు, మల్లేశం, పుష్ప, పద్మ, యాదగిరి, కనకరాజు, కనకయ్య, అగ్ని భాను, రాజు, కనకయ్య, నీరటి లక్ష్మయ్య, నర్సింలు, కళ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ పదవిపై ఆశావహుల కలలు

ప్రజాపక్షం/మహాముత్తారం: రాజకీయం పైన అవగాహన లేకుంటే లక్షలు పెట్టి సర్పంచి పదవిని కొనుక్కున్నట్టే లెక్క, వచ్చేది గోరంత ఖర్చు పెట్టేది కొండంత లాస్ట్ కు మిగిలేది పేరు మాత్రమే, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అరా కోర నిధులతో బుగ్గలు (వీధి దీపాలు) వేయడం, చెడిపోయిన బోర్ లను రిపేర్ చేయడం, ఉన్న నిధులతో సీసీ రోడ్ వేయడం అడనంగా బోర్లు వేయించడం మోరీలు తీయడం. రాష్ట్ర ప్రభుత్వం నుండి అభివృద్ధికి నిధులు రాక పొద్దుగాల 6 గంటలకు లేసి తయారు అయ్యి, ఎమ్మెల్యే గారింటికి పోయి రాత్రి పది దాకా ఎమ్మెల్యే ఏ ఊరికి ప్రోగ్రామ్ ఉంది అంటే ఆ ఊరికి పోయి రోజు మొత్తం ఛాయల మీద, సమోసల మీద బతికి రాత్రి పదింటికి ఇంటికి వచ్చి బుక్కెడంత బువ్వ తిని మళ్ళీ తెల్లారి లేచి మల్ల గల్లనే పొంగ పొంగ ఎమ్మెల్యే అబ్బా, ఈ సర్పంచ్ మనోడే మన వర్గమే మన అభిమానే అని ఏ రెండు ఏండ్లకో,మూడు ఏండ్లకో ఒక్క పని ఇస్తే దానికి డిఈ (3), ఏఈ (5) (ఈఈ) 2 అన్నీ ఐయినక ఎం బి తీసుకోని గ్రామ కార్యదర్శి కి చెక్ కొరకు పోతే 3 నుంచి 6 వరకు డిమాండ్ చేసి తిప్పి తిప్పి పై పర్సంటేజి తీసుకోని చెక్ రాసుకొని ఎస్‌టిఓ కు పోతే దానికి ఫ్రీజింగ్ ఎప్పుడు వస్తాయో తెలువదు.

ఇక 5 ఏళ్లలో వచ్చే పండగల కు నవరాత్రులకీ తెల్లారితే ఎవరు ఏమీ అడుగు తారో తేలువది,సచ్చిన సర్పంచ్ బతికినా సర్పంచ్ అలుమగలు కొట్లాడుకున్న సర్పంచ్ పండుగలకు లైట్లు,కనీస వసతులు ఏర్పాటు చేపించడం కోసం జేబుల నుండి సొంత పైసలు తీసి పెట్టడం వాటికి సంబంధించిన బిల్ వస్తే తీసుకోవడం లేక పోతే వదిలెయ్యడం. తర్వాత ఊరిలో ఉన్న సర్పంచ్ వ్యతిరేక వర్గం వాళ్ళు చేసే చెడు పనులు అనగా సర్పంచ్ ల మీద కేసులు పెట్టించడము. కమిషన్ తీస్కొనిది, డిఈ, ఏఈ, ఈఈ ఎంబీ ఇవ్వరు. గిసొంటి పరిస్థితిలు పెట్టుకొని ఎలా ఒక ఆత్మభిమానం ఉన్న ఉన్న వ్యక్తి ప్రస్తుత రాజకీయాల్లోకి రాగలడా. ఇది ప్రస్తుతం రచ్చబండ వద్ద పల్లెల్లో గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా నాయకుల నోట మాటలు, లోకం పల్లెల్లో వాడల్లో నలుగురు ఉన్న చోట మాట్లాడుకున్న మాటలు గుస,గుస. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా ఏంటో ప్రజలే వేచి చూడవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# నాంచారమ్మ జాతరకు వేళాయే...

### కాకతీయుల కాలంలో రామప్ప గుడితో పాటు ఆలయ నిర్మాణం



ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి/వెంకటాపూర్: ఎనిమిది వందల సంవత్సరాల క్రితం తెలుగు మాట్లాడే ప్రజలందరిని ఏకం చేసి పరిపాలించిన కాకతీయ రాజుల కాలంలో రామప్ప దేవాలయంతో పాటు అద్భుత శిల్ప సంపదతో నిర్మించబడింది ఎరుకల నాంచారమ్మ ఆలయం ములుగు జిల్లా రామానుజాపూర్ గ్రామ సమీపంలోని పచ్చని పంట పొలాల మధ్య నిర్మించిన నాంచారమ్మ ఆలయం(పంచకూటాలయం) కాలక్రమంలో పూజలకు నోచుకోక నిరాధరణకు గురైంది. పురావస్తు శాఖ అధికారులు అభివృద్ధి పేరుతో పునర్నిర్మాణం చేస్తామని ఆలయాన్ని విప్పి కుప్ప పెట్టారు. సమీపంలోని చెంచు కాలనీ అటవీ ప్రాంతంలో కొన్ని శిల్పాలు మరికొన్ని రామానుజాపూర్ గ్రామ శివారులో చిందర వందరగా పడేశారు. ఎంతో విశిష్టత కలిగిన ఆలయం వద్ద తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు ఆధ్వర్యంలో 8 సంవత్సరాలుగా ప్రతి ఏటా వైభవంగా జాతర నిర్వహిస్తున్నారు.

**వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున జాతర**

ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున ఎరుకల నాంచారమ్మ జాతర వైభవంగా జరుగుతుంది. 2018లో మొదటిసారి జాతర నిర్వహించగా ఈసారి మే 23న జాతర నిర్వహించనున్నారు. దేవుళ్ళకి ఎరుక చెప్పిన ఘన చరిత్ర కలిగిన నాంచారమ్మను దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి ఎరుకల కులస్తులు భారీగా తరలి రానున్నారు. జాతర మొదటి రోజు లక్ష్మీ దేవిపేట గ్రామం నుండి ఎరుకల కులస్తులు సంప్రదాయబద్ధంగా వస్తున్న ఆచారాల ప్రకారం డప్పు చప్పుళ్ళ మధ్య నైవేద్యం తీసుకువస్తారు. రామానుజాపూర్ గ్రామంలో కోలాటాలు వివిధ వేషాధారణలతో ఉన్న ఎరుకల కులస్తులు తమ వైవిధ్యాన్ని చూపిస్తారు. తిరుగువారం రోజు ఎరుకల కులస్తులు నాంచారమ్మకు ప్రత్యేక మొక్కులు చెల్లించడంతో జాతర ముగుస్తుంది

**అధికారులు సౌకర్యాలు కల్పించేనా..?**

8 సంవత్సరాలుగా జాతర జరుగుతుండగా ప్రతి సారి జాతరకు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుంది. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం అధికారులు ప్రతిసారి నిర్లక్ష్యం చూపుతున్నారు. వేసవి కాలం కావడంతో కనీసం తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు వైద్య సౌకర్యం కల్పించేలా అధికారులు చొరవ చూపాల్సి ఉంది. ప్రధాన రహదారి నుండి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నాంచారమ్మ జాతరకు ప్రస్తుత జిల్లా కలెక్టర్ రోడ్డు సౌకర్యం కల్పించడంలో ప్రత్యేక చొరవ చూపారు. ఆలయానికి చెందిన భూమి కొంత అన్యాక్రాంతం కాగా భూమిని రక్షించి చుట్టు ప్రహరీ నిర్మించేలా అధికారులు చొరవ చూపాల్సి ఉంది. ప్రతి ఏటా జరిగే జాతరకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

## దేశంలో అత్యధిక ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే



ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : దేశంలో అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఇచ్చిన అన్ని ఉద్యోగాలు ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని.. ఇచ్చినట్లు నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. బుధవారం వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా వరంగల్ హంటర్ రోడ్‌లోని సిఎస్ఆర్ గార్డెన్‌లో మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సమావేశం, నాని గార్డెన్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గ సమావేశం మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకుముందు నర్సంపేటలో పద్మశాలి గార్డెన్స్‌లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన పట్టభద్రుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ.. మోసపోతే గోస పడతామని తాము గత అసెంబ్లీ ఎన్నికల ముందు చెప్పినప్పటికీ ప్రజలు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించడంతో మోసపోయి ఆ పార్టీకి ఓట్లు వేశారని.. ఇప్పుడు గోస పడుతున్నారన్నారు. నోటిఫికేషన్ ఇచ్చింది మేము.. ఉద్యోగాలు ఇచ్చింది మేమైతే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధాలు ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకీ జాబ్ క్యాలెండర్ ఎక్కడ.. నిరుద్యోగులు మళ్లీ మోసపోకండని సూచించారు. మెగా డీఎస్సీ.. దగా డీఎస్సీ అయిందన్నారు. టెట్ పరీక్షకు ఫీజు రూ. 400 ఉండేదని ఇప్పుడు రూ. 1000 అయిందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ప్రజా గొంతుక అయిన రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కేటీఆర్ కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ మారెపెల్లి సుధీర్ కుమార్,కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సుందర్ రాజ్ యాదవ్, గ్రాడ్యుయేట్స్ ఎన్నికల సమన్వయకర్త రవీందర్‌రావు, సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ సతీష్‌రెడ్డి, జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్‌లో 24న రాజ్యాంగ పరిరక్షణ సదస్సు

ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ : ఈ నెల 24న హన్మకొండలోని ప్రెస్‌క్లబ్‌లో ఇంటలెక్చువల్ ఫోరమ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ సదస్సు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందని ఫోరమ్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎం. ఎర్రగట్టు స్వామి, కో కన్వీనర్ ప్రొఫెసర్ జి. వీరన్న నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాజ్యాంగ పరిరక్షణ సదస్సుకు ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొంటారని, రాజ్యాంగ పరిరక్షణలో ప్రజాప్రతినిధులు పాత్ర అనే అంశంపై సామాజిక విశ్లేషకులు బొజ్జా బిక్షమయ్య ప్రధాన వక్తగా పాల్గొంటారని, గౌరవ అతిథులుగా ప్రొఫెసర్ కోదండరాం,కూరపాటి వెంకట్ నారాయణ, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రుపాషా, తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, సామాజిక ఉద్యమకారిణి ప్రీతి దయాల్ హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ఈ రాజ్యాంగ పరిరక్షణ సదస్సుకు విద్యార్థులు,యువకులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## తెలంగాణలో అదుపులోకి తీసుకున్న ఏపి పోలీసులు

ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి: తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్ల నియోజకవర్గానికి చెందిన పిన్నెల్లి రామ కృష్ణ రెడ్డి ఎన్నికల రోజు ఈవీఎం మెషిన్ ను ధ్వంసం చేశాడు, దీన్ని సీరియస్‌గా తీసుకున్న కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే అతడిని అరెస్టు చేయాలని ఆ రాష్ట్ర డీజీపీ కి ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పిన్నెల్లి రామకృష్ణా రెడ్డితో పాటు అతని సోదరుడు పరార్యయ్యారు బుధవారం సంగారెడ్డి జిల్లా కంది చౌరస్తా వద్ద పిన్నెల్లి సోదరులు తమ వాహానాల్లో సెల్ ఫోన్లు వదిలేసి అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. పిన్నెలిని అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక పోలీసులు చెబుతున్నారు.

## జూన్ 4న జరుగు ఓట్ల లెక్కింపును పగడ్బందీగా నిర్వహించాలి



ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి: జూన్ 4న జరుగు ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి ,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక పిఎస్ ఆర్ గార్డెన్‌లో కౌంటింగ్ సూపర్‌వైజర్లకు సహాయకులకు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్నా ఓట్ల లెక్కింపు ఎలా చేయాలనే అంశంపై మాస్టర్ ట్రైనర్ ద్వారా శిక్షణా ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సూపర్ వైజర్లు 153,సహాయకులు , 173 మంది సిబ్బంది మొత్తంగా 326 మందికి బుదవారం శిక్షణా కార్యక్రమము నిర్వహించడం జరిగిందని తెలిపారు. మొత్తం 14 ఉంటాయని అందుకనుగుణంగా ,రెండవ శిక్షణా కార్యక్రమంలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సిబ్బందిని కేటాయించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి ,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓలు ,రాజు, పాండు, అశోక్ చక్రవర్తి, మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్, సంగారెడ్డి,కామారెడ్డి జిల్లాల నుంచి వచ్చిన కౌంటింగ్ సూపర్ వైజర్లు సహాయకులు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## తడిసిన వరి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి..



ప్రజాపక్షం/సిద్దిపేట(ప్రతినిధి: అకాల వర్షంతో తడిసిన వరి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని మాజీ మంత్రి ఎంఎల్ఎ తన్నీరు హరీష్ రావు ప్రభుత్వానికి సూచించారు. బుధవారం సిద్దిపేట జిల్లా చిన్నకోదూర్ మండలంలోని ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వచ్చే మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతవరణ శాఖ హెచ్చరిస్తున్న ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని అన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు రైతులు కళ్ళాల్లోనే పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో పంటలకు 5 వందల బోనస్ అందజేస్తామని ఇప్పుడు కేవలం సన్న వడ్లకు మాత్రమే ఇస్తామనడం రైతులను మోసం చేయడమే అవుతుందని అన్నారు. జిల్లాలో 3,38,389 ఎకరాల్లో వరి సాగు చేశారని 3 లక్షల 29 వేల ఎకరాల్లో దొడ్డ రకం చేశారని 16 వేల ఎకరాల్లో మాత్రమే సన్నరకం సాగు చేశారని తెలిపారు. 95% శాతం దొడ్డు వడ్లు పండించే రైతులకు బోనస్ ఎగ్గొట్టి కేవలం 5% శాతం సన్నవడ్లు పండించే వాళ్ళకు బోనస్ అందజేస్తామనడం రైతులను దగా చేయడమే అని అన్నారు. బాతా రేవస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మంత్రులు కళ్ళాల్లో తిరిగే వాళ్ళని ఇప్పుడు ఒక్క మంత్రి కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించడం లేదని ఇప్పటికైనా మంత్రులు క్షేత్ర స్థాయిలో ధాన్యం కేంద్రాలను సందర్శించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.